ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబర్ 2025





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మహాసభల కోసం

సిఐటియు జీపుజాతా

◆ అఖిల భారత సిఐటియు మహాసభల విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా పర్యటన
◆ మద్దతుగా కదిలొచ్చిన కార్మికలోకం
◆ జాతా పర్యటన ప్రాంతాల్లో కార్మికుల నుంచి స్పందన
◆ 4న బహిరంగ సభలో పాల్గొంటాం : కార్మికులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అఖిలభారత సిఐటియు మహాసభల విజయవంతం కోరుతూ జిల్లాలో ఆ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నాడు జీపుజాతాను ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ జాతా జిల్లా అంతా పర్యటించి కార్మికులను సమీకృతం చేయనుంది. మహాసభల ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై జాతా ద్వారా నాయకులు వివరించారు. జిల్లాలో జాతా వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ కార్మికులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. స్వచ్ఛందంగా కార్మికులు జాతా బృందానికి మద్దతు తెలుపుతూ స్వాగతం పలికారు. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం సిఐటియు చేస్తున్న పోరాటాలు, కార్యక్రమాలను అభినందిస్తూ తామూ మహాసభల్లో పాల్గొంటామంటూ తెలియజేశారు. 4వ తేదీన విశాఖలో జరిగే బహిరంగ సభలో పాల్గొని కార్మికుల సత్తా చాటుదామన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో సిఐటియు జీపుజాతా కదిరి పట్టణంలో ప్రారంభం అయ్యింది. జాతాను మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జాతా ముందుకు సాగింది. కదిరిలో ప్రారంభం అయిన జాతా ముదిగుబ్బ, ధర్మవరం, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి వరకు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో జాతాకు కార్మికులు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా నాయకులు మహాసభల ఆవశ్యకతను తెలియజేస్తూ జనవరి 4వ తేదీన విశాఖ పట్నంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కదిరిలో జాతాను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

కార్మికలోకం సత్తా చాటాలి
మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

సిఐటియు 18వ అఖిలభారత జాతీయ మహసభల సందర్భంగా జనవరి 4వ తేదీన జరిగే బహిరంగ సభలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్మికలోకం సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పిలుపునిచ్చారు. కదిరిలో జీపుజాతాను ప్రారంభించిన ఆయన కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖ కేంద్రంగా డిసెంబర్ 31, జనవరి 1,2,3,4వ తేదీల్లో సిఐటియు జాతీయ మహాసభలు జరగనున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారన్నారన్నారు. అయినా కేంద్రంలోని బిజెపి కార్పొరేట్ల కోసం లేబర్ కోడ్స్‌ను తెస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో పని చేసే అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఇలా కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేసి భవిష్యత్తు కార్యక్రమాన్ని తయారు చేస్తారని చెప్పారు. ఇందులో భాగంగా జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్ గ్రౌండ్‌లో లక్షలాది మంది కార్మికులతో నిర్వహించే ర్యాలీ బహిరంగ సభలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, జిల్లా కోశాధికారి లక్ష్మీనారాయణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ సాంబశివ, బాబ్‌జాన్, పెడపల్లి బాబా అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజాత, రంగమ్మ, భారతి, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, జనార్ధన్, సివిల్ సప్లయ్ యూనియన్ నాయకులు శివ, భవన నిర్మాణరంగం కార్మికులు రమేష్, శ్రీదేవి, గౌరమ్మ ముస్తాక్, రామ్మోహన్, ఆంజనేయులు, జగన్మోహన్ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగా వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం పీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి ఇచ్చే ప్రాధాన్యతలో భాగంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, డిఆర్వో సూర్యనారాయణ రెడ్డితో కలిసి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వికలాంగుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వికలాంగుల వద్దకే స్వయంగా వెళ్లి, వారి సమస్యలను సావధానంగా ఆలకించి అర్జీలను స్వీకరించారు. ఇందులో కొన్నిటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేపట్టి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉందన్నారు. వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా ఇకపై ప్రతి నెల నాలుగో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయగానే అర్హులైన అందరికీ పింఛన్లు అందిస్తామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నారాయణస్వామి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు అర్చన, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ, ఎల్‌డిఎం రమణ కుమార్, సమాచార శాఖ ఏడీ పురుషోత్తం, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

30 సంవత్సరాల నుండి పాత్రికేయ వృత్తిలో ఉంటూ ఇటీవల అనారోగ్యనికి గురై విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ పాత్రికేయుడు బసప్పకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు వారు శుక్రవారం బసప్ప నివాసం వద్ద యూనియన్ నాయకులు పుల్లయ్య, బాబు ఆధ్వర్యంలో 20, వేల చెక్కును, 5 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాత్రికేయుని ఆరోగ్యపరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు, గతంలో చికిత్స పొందిన వైద్య ఖర్చులను సీఎం సహాయ నిధి నుండి అందిస్తామని భరోసా ఇచ్చారు.



బసప్పకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బాల పురస్కార్ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ధైర్యం, సాహసంతో ముందుకెళ్తే ప్రతి బాలుడికీ జాతీయ గుర్తింపు సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ అన్నారు. మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీర బాల్ దివాస్ కార్యక్రమాన్ని శుక్రవారం పుట్టపర్తి నియోజకవర్గంలోని చిన్నపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వీరులు, వీర వనితల గురించి మాత్రమే మనం వినేవాళ్లమని, అయితే 2022 నుంచి భారత ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును ప్రారంభించి, అసాధారణ ధైర్యసాహసాలు, సేవా కార్యక్రమాలు చేసిన బాలలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రతి బాలుడు తనకు ఆసక్తి ఉన్న రంగంలో కృషి చేస్తే ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు పొందేందుకు అర్హుడవుతాడని అన్నారు. 2024 సంవత్సరానికి గాను శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన బాలుడు రాగి సూర్య ప్రసాద్ గౌరవ రాష్ట్రపతి గారి చేతుల మీదుగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకోవడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన అసాధారణ సాహసానికి ఈ అవార్డు లభించిందని తెలిపారు. ప్రస్తుతం రాగి సూర్య ప్రసాద్ ఏపీఆర్ఎస్ రెసిడెన్షియల్ స్కూల్, కొడిగినహల్లిలో విద్యనభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు గ్రహీత రాగి సూర్య ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా చిన్నపల్లి హైస్కూల్ మరియు కేజీబీవీ పాఠశాలలలో ప్రతిభ కనబరిచిన బాల బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, డిఇఒ కిష్టప్ప, డీసీపీఓ మహేష్, రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు గ్రహీత రాగి సూర్య ప్రసాద్ తల్లిదండ్రులు, జిల్లా బాలల పరిరక్షణ సమితి సిబ్బంది, శిశుగృహ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాలపురస్కార్ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న కలెక్టర్

కంది కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో కంది కొనుగోళ్లలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కందిని రూ.8వేలతో కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ గారి అధ్యక్షతన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కంది కొనుగోళ్లపై జిల్లా స్థాయి ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో కంది పంట కొనుగోళ్లను సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో కంది పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా క్రాప్ రిజిస్ట్రేషన్‌లో నమోదు అయి ఉండాలని, అలాగే తమ వివరాలను సీఎం యాప్‌లో ఆర్బీకేల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కంది కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, తరచూ వచ్చే నమూనా పరీక్షలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కంది కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి, నిల్వ, రవాణా వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 8వేల ప్రకారం రైతులకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.8వేల కంటే తక్కువకు అమ్ముకోరాదని రైతులకు చెప్పారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ అర్చన, జెడిఎ కృష్ణయ్య, జిల్లా సహకార అధికారి కృష్ణనాయక్, డీఆర్‌డీఏ పీడీ నర్సయ్య, డీఎస్‌ఓ వంశీకృష్ణ, మార్కెటింగ్ అధికారి మూర్తి, ఎస్‌డబ్ల్యుసి వేర్‌హౌసెస్ అధికారి హుస్సేన్, డీసీఎంఎస్ ఇంద్రసేనారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ప్రధాన కూడళ్లు, ఇతర ప్రదేశాల్లో పురపాలక సంఘ అనుమతులు తీసుకోకుండా ఎవరైనా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాలు, వివిధ సంస్థలు వారి ప్రచారాల కోసం పురపాలక సంఘ అనుమతులు తీసుకోకుండా ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులు, ముఖ్య ప్రదేశాల్లో ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ప్రజా రహదారి భద్రత, వాహనాల రాకపోకలకు అంతరాయం, పాదాచారుల భద్రత, విద్యుత్ తీగల ప్రమాదం ఉంటుందన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా పురపాలక సంఘ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే పురపాలక సంఘం వారిని సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు.



సిబ్బంది, ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్

రైతులకు అందుబాటులో ఉండాలి : జేసీ

ప్రజాశక్తి-హిందూపురం

రైతు సేవా కేంద్రంలో పనిచేసే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలను వివరించి మెరుగైన సేవలందించాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం కగ్గల్లు రైతు సేవా కేంద్రాన్ని జేసీ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా యూరియా, ఇతర ఎరువుల పంపిణీ, నిల్వలు, పంటల సాగు వివరాలు, సమస్యల గురించి రైతులతో చర్చించారు. యూరియాను వివిధ పంటల మోతాదు ప్రకారం ఎరువులు వాడాలని, అధికంగా వాడకం వల్ల భూమి, నీటి కాలుష్యం పెరగడమే కాకుండా తెగుళ్లు ఎక్కువ సోకుతాయని చెప్పారు. ఎరువులకు ఎలాంటి ఇబ్బంది లేదని అవసరమైన మేరకు జిల్లా వ్యాప్తంగా సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులు అంకిత భావంతో ఉంటూ ఎప్పటికప్పుడు రైతులకు నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్, విస్తరణ అధికారులు పుష్పలత, శంకర్ రెడ్డి, ఆర్ఐ అమర్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి ఒక్కటే రైలు..!

◆ ఉన్న రెండింటిలో ఒకటి రద్దు.. మరొకటి పొడిగింపు ◆ నత్తనడకన అభివృద్ధి పనులు
◆ 'పురం' స్టేషన్‌లో రైలు ఎక్కాలంటే పట్టాలు దాటాల్సిందే ◆ ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



హిందూపురం రైల్వే స్టేషన్

హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం. ఇక్కడి నుంచి రాష్ట్ర రాజధానికి వెళ్లాలంటే ఒక్కటే రైలు ఉంది. దీంతో పాటు బెంగళూరు నుంచి పుట్టపర్తికి ఒకటి, ధర్మవరం వరకు మరొకటి రెండు రైళ్లు తిరుగుతుండేవి. వీటిలో ఒక రైలును రద్దు చేశారు. మరోక రైలును అనంతపురం వరకు పొడగించారు. దీంతో రెండు రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు ఒక రైలులో వెళ్లాల్సి వస్తోంది. ఒక స్టేషన్‌లో అయితే ఒకటో నెంబరు ఫ్లాట్ ఫాంపై రైళ్లు ఆగవు. దీంతో రైలు ఎక్కాలంటే పట్టాలు దాటాల్సిన వస్తోంది. ఇలా చెప్పుకుంటు పోతే స్టేషన్‌తో పాటు రైళ్ల సమస్యలు హిందూపురంలో ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయి. హిందూపురానికి శనివారం నాడు రైల్వే సహాయ మంత్రి వస్తున్న నేపథ్యంలో రైళ్లు, రైల్వే స్టేషన్‌పై ప్రజాశక్తి ప్రత్యేక కథనం.....

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం తర్వాత అన్ని విధాలా అభివృద్ధి చెందిన పట్టణం హిందూపురం. ఇక్కడ రెండు లక్షలకు పైగా జనాభా ఉంది. మడకశిర, పెనుకొండ నియోజక వర్గాలకు కేంద్ర బిందుపు హిందూపురం పట్టణం. బ్రిటీష్ పరిపాలన కాలంలో నిర్మించిన రైల్వే స్టేషన్ రాకపోకలకు ముఖ్యమైన వనరు. ఇంతటి ప్రధానమైన రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడంలో పాలకులు వెనుకబడ్డారు. ఎంతటి వెనుకబాటు తనమంటే ఇక్కడి నుంచి రాజధాని ప్రాంతమైన విజయవాడ, విశాఖపట్నంకు ఒకే రైలు నడుస్తోంది. అది కుడా బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే. నాటికి నేటికి ప్రయాణికులు 100 శాతంకు పైగా పెరిగినప్పటికి ఒక్కటే రైలు ఇప్పటికీ ఈ మార్గంలో నడుస్తోంది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో విజయవాడ మీదుగా బెంగళూరు నుంచి మచిలీపట్నం వరకు కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో మంగళవారం, గురువారం, శనివారం మూడు రోజులు రాకపోకలు సాగించే ఏర్పాటు చేశారు. దీనిని ప్రతి రోజూ నడిచే విధంగా చర్యలు తీసుకుంటే రద్దీ తగ్గే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ దీని గూరించి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఇద్దరు ఎంపిలు దృష్టి సారించ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హిందూపురం పార్లముంట్ కేంద్రమైనా ఇక్కడి నుంచి గెలుస్తున్న పార్లమెంట్ సభ్యులు రైల్వే సమస్యలపై నోరు మెదపడం లేదు. సమస్యలను రైల్వే ఉన్నాతాధికారులతో చర్చిస్తే చిన్నచిన్న సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నా ఆ మేరకు దృష్టి సారించడం లేదు.



టికెట్ల కోసం క్యూ కట్టిన ప్రయాణికులు

నిత్యం వేలాది మంది ప్రయాణం

విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మహానగరాల్లో ఉన్న విద్యాసంస్థల్లో హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల నుంచి దాదాపు 10 నుంచి 15వేల మంది విద్యార్థులు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50వేల మంది వరకు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఈ ప్రాంత నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. దీంతో పాటు రాష్ట్ర రాజధాని కావాడంతో ప్రయాణికుల సంఖ్య ఇటీవల మరింత పెరిగింది. వీరందరికీ ఉన్న ఏకైక రైల్వే వనరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఒక్కటే. వారంలో మూడు రోజుల పాటు నడిచే కొండవీడు ఎక్‌ప్రెస్ ఉన్నా అది అంతలా ఉపయోగపడం లేదు. హిందూపురం వ్యాపార కేంద్రంతో పాటు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో పాటు ఈ ప్రాంత విద్యార్థులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ హిందూపురం రైల్వే స్టేషన్‌కు రూ.2 నుంచి 2.50లక్షల వరకు ఆదాయం ఉంది. నెలకు సుమారు రూ.70లక్షల వరకు పురం రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. ఆదాయానికి అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన రైల్వే అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. స్టేషన్‌లో రెండు కౌంటర్‌లు ఉన్నప్పటికీ ప్రయాణికులకు పూర్తి స్థాయిలో టికెట్టు అందక ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ, విశాఖపట్నంకు వెళ్లే ప్రశాంతి రైలుకు అయితే తత్కాల్ టికెట్లు క్షణాల్లో పూర్తి అవుతున్నాయి. విజయవాడ, విశాఖపట్నంకు ప్రత్యేక కోటను ఎంపిలు సాధిస్తే కాస్తా సమస్య తగ్గే అవకాశం ఉంది.

అధికారుల నిర్లక్ష్యం...ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు...

ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఏ రైల్వే స్టేషన్‌లో లేని విధంగా హిందూపురం రైల్వే స్టేషన్‌లో వింత పరిస్థితి ఉంది. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ఎక్కడ చూసిన మొదటి ప్లాట్ ఫాంపై ఉంటుంది. హిందూపురం రైల్వే స్టేషన్‌లో మాత్రం 2, 3వ ప్లాట్‌ఫాం రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. దీనికి రైల్వే ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం నిలువెత్తున కనిపిస్తున్నది. ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి టికెట్ తీసుకుని రైలు ఎక్కడానికి వెళ్లాలంటే తప్పనిసరిగా ఓవర్ బ్రిడ్జ్ ఎక్కి వెళ్లాలి, లేదా పట్టాలు దాటాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు, అంగ వైకల్యం ఉన్నవారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వీరికి అవసరమైన లిఫ్ట్, ర్యాంప్ బ్రిడ్జి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ప్రతి రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేషన్ బోర్డ్ ఏర్పాటు చేసి ఉంటారు. పురం స్టేషన్‌లో అలాంటివేమీ కనిపించడం లేదు. ఏ కోచ్ ఎక్కడ వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. మరి కొంతమంది బ్రిడ్జి ఎక్కి దిగడానికి ఆలస్యం అవుతుందని ప్లాట్ ఫామ్ దాటుకుని వస్తున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా నిండు ప్రాణాలు గాలిలో కలిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మంత్రిగారైనా స్పందిస్తారా...?

కాచిగూడ–యశ్వంతపూర్‌ల మధ్య ప్రయాణించే వందే భారత్ రైలు ప్రయాణికుల సౌకర్యర్థం హిందూపురం రైల్వేస్టేషన్ నిలపనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీనిని శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపి పార్థ సారథితో కలిసి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న హిందూపురం రైల్వేస్టేషన్‌లో ప్రారంభించనున్నారు. ఈ సమయంలో హిందూపురం రైల్వే స్టేషన్ సమస్యలపై మంత్రి దృష్టికి స్థానిక ఎంపి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

హిందూపురం రైల్వే స్టేషన్ అమృత్ పథకంలో ఎంపిక అయింది. దాదాపు రూ.15కోట్లతో గత రెండు సంవత్సరాల క్రితం పనలను ప్రారంభించారు. నేటికి ఆ పనుల పూర్తి కావాడం లేదు. రైల్వే ఉన్నాతాధికారుల మాటలు కోటలు దాటుతున్న అభివృద్ధి మాత్రం గడపదాటడం లేదు.



మూడవ ఫ్లాట్ ఫాంలో రైలు ఆగడంతో పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

సిఐటియు మహాసభలను విజయవంతం చేద్దాం



ధర్మవరంలో జీపుజాతాలో నాయకులు, ప్రజలు



ముదిగుబ్బలోని జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు



కొత్తచెరువులో జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సిఐటియు18 వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో జీపు జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఉమ్మడి జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ డి.దిల్షాద్. జిల్లా సిఐటియు కార్యదర్శి సాంబశివ తదితరులు మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియూ ఆఫీస్ బేరర్స్ అయూబ్ ఖాన్, సాంబశివ, బాబ్ జాన్, పెడపల్లి బాబా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు నాయకులు ఎల్. ఆదినారాయణ, ట్రాన్స్‌పోర్టు రంగం పట్టణ నాయకులు ఎస్. రఫీ, గోపాల్, పుల్లప్ప, షేక్ రఫీ, స్థానిక మున్సిపల్ సంఘం నాయకులు మేకల బాబు, ముకుంద, ఓబులేసు, పుల్లన్న,పెద్దక్క, చెన్నకేశవులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ :సీఐటీయూ అఖిల భారత 18 వ మహాసభలు విశాఖ లో జరుగుతున్న సందర్భంగా సత్యసాయి జిల్లా కదిరి నుండి ప్రారంభమైన జీపు జాత ముదిగుబ్బ బస్టాండ్ సర్కిల్ చేరుకొన్నది...మహాసభలు గురించి సిపిఎం, సీఐటీయూ జిల్లా, మండల నాయకులు ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో కూటమి ప్రభుత్వం పూర్తి ప్రజా వ్యతిరేక పాలన చేస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను మర్చి 4 లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. అసంగటిత కార్మికులకు కనీస వేతనాలు లేవని కాంట్రాక్ట కార్మికులుగానే రిటైర్ అవుతుమన్నామని అన్నారు యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక హక్కులకోసం దేశ వ్యాప్తంగా పోరాడే మహెూత్తర కర్తవ్యలను ఎలా నిర్వహించాలో ఈ మహా సభ చర్చిస్తుంది. భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తుంది...ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శులు బాబ్జాన్ సాంబశివ పెడబల్లి బాబా మరియు ముదిగుబ్బ కార్యదర్శి ఆటో పెద్దన్న, బాబ్జాన్, గౌరవాధ్యక్షుడు బండల వెంకటేశు నౌ షాద్ రఫీ, ఓబులేసు పకీరప్ప రైతు సంఘం నాయకులు పోతలయ్య ఖాదర్ వలీ అంగన్వాడి రజియా మరియు పంచాయతీ కార్మికులు ఆటో స్టాండ్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

జీపు జాతాలో నాయకులు

కొత్తచెరువు: సీఐటీయూ అఖిల భారత 18 వ మహాసభల నేపథ్యంలో కదిరి నుండి ప్రారంభమైన జీపు జాతకొత్తచెరువు నెహ్రూ సర్కిల్ చేరుకొంది. సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సాంబశివ, బాబ్ జాన్, ముత్యాలు మాట్లాడుతూ 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శంకర్ రెడ్డి, ఐద్వా నాయకులు శ్రావణి, షబానా, జానపద కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, భవన నిర్మాణ కార్మికులు కేశవ, పెద్దన్న, హనుమంతు పాల్గొన్నారు.

కందికి మద్దతు ధర

ప్రజాశక్తి - ముదిగుబ్బ

కందికి మద్దతు ధర లభించడానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ముదిగుబ్బలో ప్రాథమిక వ్యవసాయ సంఘము ఏర్పాటు చేసిన కంది పంటపై రైతుల అవగాహన సదస్సులో డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఆదినారాయణ , సబ్ డివిజనల్ కో-ఆపరేటర్ బి జనార్ధన్ , అగ్రికల్చర్ ఆఫీసర్ రవీందర్, సిఇఒ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు పదివేల ఎకరాల్లో ఈ ఏడాది కందిపంట సాగు చేశారన్నారు. అయితే అధిక వర్షాలు, వాతావరణం మార్పులు, చీడపురుగులతో ఆశించిన దిగుబడి రాలేదన్నారు. కందులు కొనుగోలు సమయంలో రైతులకి ఖచ్చితమైన సమాచారం ఇచ్చి కనీసం మద్దతు ధర కంటే తక్కువగా లేకుండా దళారులు చేతులలో పడకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర పన్నుతోందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడం సరైనది కాదన్నారు. కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తూ చట్టాలను కుదించి వేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దానిని వ్యతిరేకించకపోవడం దుర్మార్గమన్నారు. 125 రోజులు పనులు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ కేంద్రం సగం నిధులు రాష్ట్రమే భరించాలని చెప్పడంలో తిరకాసు ఉందని, ఈ ప్రకారంగా 50 రోజులు కూడా ఉపాధి పనులు కల్పించే అవకాశం ఉండదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించడంలోనూ, కోవిడ్ సమయంలోనూ ఉపాధి హక్కు చట్టం పని చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని కేవలం ఒక పథకముగా కొనసాగించడం వెనక చాలా కుట్ర దాగి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలను రూపొందించడంలో భాగంగా అన్ని మండలాల్లోనూ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే ఆల్ ఇండియా సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి రమణ, సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిఐటియు రైతు సంఘం నాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు : కలెక్టర్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వీఆర్వో, విఎస్ లపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ధర్మవరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. తనిఖీ అనంతరం కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం, దరఖాస్తుల పెండింగ్ తగ్గింపు, సేవల వేగవంతీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా దాఖలు చేయవలసిన పౌర సేవల దరఖాస్తులను కొంతమంది వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు స్వయంగా పరిశీలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని, ఇకపై ఇలాంటి పద్ధతులను పూర్తిగా నిలిపివేయాలని వీఆర్వోలు, వీఎస్‌లను హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణమే చర్యలు తీసుకుని క్రమశిక్షణా చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందాల్సిన పౌర సేవలు పూర్తిగా పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పోతుకుంట గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్ మెంట్ రిజిస్టర్, వివిధ సంక్షేమ పథకాల ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితా, ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అప్పుడే ప్రజలకు అధికారులపై నమ్మకం కలుగుతుందని అన్నారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, తహసిల్దార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్లది కీలక పాత్ర : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శాంతి భద్రతల పరిరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని, కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జనవరి 1వ నుంచి శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించనున్నామని ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో రూ. సుమారు రూ 24,లక్షల విలువైన రెండు నైట్ విజన్ డ్రోన్లు, మూడు డే విజన్ డ్రోన్లను పుట్టపర్తి, హిందూపురం, మడకశిర, పుట్టపర్తి అర్బన్, పుట్టపర్తి రూరల్, నల్లమాడ సర్కిల్ పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్లు నేరాల అరికట్టడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో సీసీ కెమెరాలతో పాటు నైట్ విజన్, డే విజన్ డ్రోన్లను వినియోగించడం వల్ల నేరాలను నియంత్రించడంతో పాటు, నేరాలు జరిగినప్పుడు దృశ్యాలు రికార్డు కావడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే హిందూపురం, మడకశిర, కదిరి ధర్మవరం, పెనుగొండ ప్రాంతాల్లో నైట్ విజన్ డ్రోన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కొత్త సంవత్సరం నుంచి పగటిపూటతో పాటు రాత్రి వేళల్లో కూడా డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ఈ డ్రోన్లు మరింత ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు. చోరీల నియంత్రణకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగిస్తామని తెలిపారు. నైట్ విజన్ డ్రోన్ల ద్వారా దొంగతనాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఈనెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వ్యక్తులు నిర్మించిన ఆలయాల జాబితాను సిద్ధం చేసి, అక్కడ సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, హిందూపురం డీఎస్పీలు విజయకుమార్, కేవీ మహేష్, సీఐలు , ఇస్మాయిల్ ,శివాంజనేయులు, నరేందర్ రెడ్డి, సురేష్, సుబ్రహ్మణ్యం, కరీం, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ అందజేస్తున్న ఎస్పీ

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పనిచేయండి : ఎమ్మెల్యే



సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులతో బాధితులు, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి అర్జీకి తగిన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలను కార్యాలయం చుట్టూ అనవసరంగా తిప్పుకోవద్దని సూచించారు. ఒక గ్రీవెన్స్ కు వచ్చిన అర్జీ మళ్లీ గ్రీవెన్స్ లో రాకూడదని తెలిపారు. రెవిన్యూ సమస్యలపై ఎక్కువ అర్జీలు వస్తున్నాయని ఈ విషయంపై తాహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి వాటికి పరిష్కారం చూపాలని కోరారు. కొంతమంది రెవెన్యూ అధికారులు రెవిన్యూ సమస్యల పైన వాస్తవాలు తెలియజేయకుండా ప్రజలను కార్యాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఇది మంచిది కాదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావతమైతే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి కొత్త చెరువు,పుట్టపర్తి ,బుక్కపట్నం మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. రెవిన్యూ ,విద్యుత్ , ఆర్ డబ్ల్యూ ఎస్, వ్యవసాయం ,గ్రామీణాభివృద్ధి ,వెలుగు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ : పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా 28 లక్షల 24 వేల 776 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక చెక్కులను నియోజకవర్గంలోని 33 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ ,నియోజవర్గ కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ప్రధాన రహదారి కి పక్కనే అంబేద్కర్ సర్కిల్ లో ఉన్న ఓ బెడ్డింగ్ సెంటర్ లో కర్నాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... కర్నాటక గౌరీబిదనూరు ప్రాంతానికి చెందిన శివ, బాలు అనే వ్యక్తులు కర్నాటకలోని మిడిగేసి తాలూకా కేతేగౌడన హళ్లి కి చెందిన మహిపాల్ సెల్ ఫోన్ దొంగతనానికి పాల్పడ్డాడని కక్షకట్టారు. మహిపాల్‌ను బెడ్డింగ్ సెంటర్‌కు తీసుకువచ్చిఉదయం నుండి రాత్రి వరకు చిత్రహింసలకు గురిచేసి ఆపై ఇనుప రాడ్ తో హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. స్థానిక బెడ్డింగ్ సెంటర్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మహిపాల్ ను హత్య చేసిన ఇరువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

కాలిపోయిన గృహసామగ్రి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ఇంటిలో ఉన్న గృహ సామగ్రి కాలిబూడిదైంది. మేదర వీధిలోని ఓ ఇంటిలో కుమ్మర జగదీష్, పార్వతమ్మలు అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన భార్య ఇద్దరు పిల్లలు ఇంటిలో ఉన్నారు. నీళ్ల కాచుకోవడానికి చిన్నారులు హీటర్ వేశారు. ఈ విషయాన్ని వారు మర్చిపోవడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న వాషింగ్ మిషన్, కలర్ టీవీ, ఫ్యాన్లు, గృహ సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. స్థానికులు స్పందించి ఇంటిలో ఉన్న వారిని సిలిండర్‌ను వెంటనే బయటికి తీసుకొచ్చారు. దీనితో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. దాదాపు లక్ష రూపాయలు దాకా నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. పుట్టపర్తి ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి ఫైర్ ఇంజన్ చేరుకుని మంటలను అర్పివేసింది.

తురకలాపట్నంలో చోరీలు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో గురువారం రాత్రి తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామంలోని కత్తె గోపాల్, ఆంజనేయరెడ్డి, కాపు కాంతమ్మ, గాజుల గంగప్ప, హనుమంతరెడ్డి ఇళ్లలో గురువారం అర్ధరాత్రి దొంగలు దోపిడీకి ప్రయత్నించారు. ఆయా కుటుంబాల సభ్యులు శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడం చూపి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. అందులో కత్తె గోపాల్ ఇంట్లో సుమారు 5 తులాల బంగారు, 2 తులాల వెండి, అంజనరెడ్డి ఇంట్లో 2 తులాల బంగారం, కాపు కాంతమ్మ ఇంట్లో 4 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మందలపల్లిలో మేకలు..

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో 4 మేకలు చోరీకి గురైనట్లు బాధితుడు నారాయణప్ప తెలిపారు. వివరాలు.. నారాయణప్ప గురువారం రాత్రి 4 మేకలను ఇంటి వద్ద కట్టేసి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. 3 నెలల క్రితం ఇంటి వద్ద కట్టివేసిన గేదెను కూడా దొంగలు తోలుకెళ్లారని, అది మరవక ముందే మళ్లీ 4 మేకలు ఎత్తుకెళ్లారని వాపోయాడు. మేకలు రూ. 60వేలు, గేదె రూ. 65వేలు చేస్తాయని తెలిపాడు. వాటి పైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించు కుంటూ ఉండేవారమని నారాయణప్ప బోరున విలపించాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నారాయణప్ప తెలిపారు. నెల రోజుల క్రితం మండలంలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన భాగ్యమ్మకు చెందిన 3 కోళ్లు, మాలింగప్పకు చెందిన మేక, ఈరన్నకు చెందిన 3 కోళ్లు, నాగమ్మకు చెందిన 3 కోళ్లు కూడా గురయ్యాయి. ఇటీవల కాలంలో గ్రామాల్లో రాత్రి వేళ వరుస చోరీలు జరగడం పట్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండలంలో చోరీల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లమాడ సిఐగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - నల్లమాడ

నల్లమాడ సిఐగా శ్రీనివాసులు నియమితులయ్యారు. పుట్టపర్తి డిసిఆర్ ఆఫీసులో పనిచేస్తున్న శ్రీనివాసులను నల్లమాడ సర్కిల్ సిఐగా నియమించడం జరిగింది. ఇక్కడ పనిచేస్తున్న నరేంద్రరెడ్డిని పుట్టపర్తి డిసిఆర్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఎఓ అబ్దుల్‌హక్ చెప్పారు. యూరియా కావలసిన రైతులు ఆధార్ కార్డు తీసుకుని వచ్చి పేర్లు నమోదు చేయించుకుని యూరియా తీసుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపు యజమానులు యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని ఆదేశించారు.

విద్యార్థుల భద్రతే ధ్యేయం

ప్రజాశక్తి కదిరి అర్బన్

విద్యార్థులకు భద్రత కల్పించే లక్ష్యంగా శక్తి టీం విధులు నిర్వహిస్తుందని సబ్ ఇన్స్‌పెక్టర్ భువనేశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక సాధన హై స్కూల్లో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోలీస్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో శక్తి యాప్ అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ గంగాధర, కానిస్టేబుల్ చలపతి. సౌత్ అలీ ఖాన్, అనూష తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - తలుపుల

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చెన్నయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని చింత వనం మైదానంలో మండల పరిధిలోని ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా వల్లెపు సోమశేఖర్

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

సత్య సాయి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గా వల్లెపు సోమశేఖర్ ను రెండవసారి ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవ సారి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గా ఎంపిక చేసినందుకు పార్టీకి క్రమ శిక్షణ తో పాటు, అంకిత భావం తో పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రంలో మాజీ జడ్పీటీసీ పిట్ట ఓబుల్ రెడ్డి, కన్వీనర్ జయచంద్ర, గిరిజన సంఘం రాష్ట్రఅధ్యక్షుడు శ్రీనివాసనాయక, అంజినప్ప, నాగేందర్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

వాతావరణం మార్పుతో కదిరి పరిసర ప్రాంతంలో పొగ మంచు మబ్బులు కమ్ముకున్నాయి. కొన్ని ప్రధాన రహదారులు ఊటీని తలపించేలా ఉన్నాయని కదిరి ప్రజలు పేర్కొంటున్నారు. ఎముకలు కొరికే చలి ఉండటంతో ఉదయాన్నే పనులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి కనపడకుండా పొగ మంచు కొమ్ముకోవడంతో ప్రమాదాలు జరుగుతాయని ఉద్దేశ్యంతో వాహనాలు కూడా ప్రక్కన పెట్టేసి టీ కొట్లలో కూర్చున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల దాకా సూర్యుడు కూడా కనపడలేదు. రోడ్డంతా పొగ మంచు మబ్బులు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం : మంత్రి సవిత

పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం కేటాయింపు.. 607 మందికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

అకృత్యాలు, దౌర్జన్యాలు, బెదరింపులతో రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యుఎస్, సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వైసిపి నాయకులను హెచ్చరించారు. పిపిపి మోడల్‌లో వైద్య కళాశాలల నిర్మాణానికి ముందుకొచ్చే కాంట్రాక్టర్లను జైలుకు పంపిస్తామని వైసిపి బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. పిపిపి బెస్ట్ మోడల్ అని సమర్థించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్రమంత్రి అమిత్ షాను కూడా అరెస్ట్ చేస్తాం అని ప్రకటించగలరా..? అని మంత్రి వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి మండలాలకు చెందిన 607 మంది లబ్ధిదారులకు ఇంటి నివేశ స్థల ధ్రువీకరణ పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఎన్టీఆర్ టిడిపిని ఏర్పాటు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు 2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేశామన్నారు. రాజధాని అమరాతి, పోలవరం ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు.

ప్రధాని మోడీని అరెస్ట్ చేస్తామనగలవా..?

సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసిపి అధినేత జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత విమర్శించారు. ప్రజలు సైతం చంద్రబాబు పాలనకు జై కొడుతుండడంతో జగన్, వైసిపి నాయకులు రప్పా...రప్పా.. అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వైద్య కళాశాలలను పిపిపి మోడల్‌లో నిర్మించి, పేదలకు వైద్య విద్య, ఉచిత కార్పొరేట్ వైద్యం త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సిఎం చంద్రబాబు ఆశిస్తుంటే జగన్ అడ్డుకుంటున్నారన్నారు. పిపిపి మోడల్‌లో వైద్య కళాశాలలు నిర్మించే కాంట్రాక్టర్లను జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. వైద్య కళాశాలలను పిపిపి మోడల్‌లో నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం కూడా మద్దతు ఇచ్చిందని, ఇప్పుడు ప్రధాని నరేంద్రమోడీని, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను అరెస్టు చేస్తామని ప్రకటించగలరా..? అని మంత్రి సవిత సవాల్ విసిరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని జగన్‌ను హెచ్చరించారు. వైసిపి నాయకులు, జగన్ బెదిరింపులకు రాష్ట్రంలో భయపడే వారెవరూ లేరని మంత్రి స్పష్టం చేశారు.



పేదలకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి సవిత

ఆ ఇళ్లు బాత్ రూమ్‌లకు ఎక్కువ బెడ్ రూమ్‌లకు తక్కువ

2014-19 మధ్య కాలంలో రాష్ట్రంలో పేదల సొంతింటి నిర్మాణానికి అప్పటి టిడిపి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసిందని మంత్రి సవిత గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిర్వీర్యం చేశారన్నారు. సెంటు స్థలంలో బాత్ రూమ్‌కు ఎక్కువ బెడ్ రూమ్‌కు తక్కువ ఇళ్లను నిర్మించారన్నారు. ఆ అయిదేళ్లలో ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైసిపి హయాంలో అర్ధాంతరంగా నిలిపేసిన ఇళ్లకు నిధులిచ్చి, గృహ ప్రవేశాలు చేయించామన్నారు. వైసిపి హయాంలో జగనన్న ఇళ్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు.

అర్హులందరికీ సొంతిళ్లు

అర్హులైన పేదలందరి సొంతింటి కల నెరవేర్చుతామని మంత్రి సవిత తెలిపారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున పేదలకు ఇంటి కోసం స్థలాలు కేటాయిస్తామన్నారు. అందుకు అవసరమైన స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తిస్తున్నారన్నారు. త్వరలోనే ఇంటిస్థలాలు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, ఆర్డీవో ఆనందకుమార్, తహశీల్దార్లు స్వాతి, ఉదయ్ శంకర్ రాజు, మారుతి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, యాదవ, వాల్మీకి కార్పొరేషన్ల డైరెక్టర్లు కేశవయ్య, డివిఆంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షులు పోతిరెడ్డి, మండల కన్వీనర్లు దండు ఈశ్వరప్రసాద్, నరహరి, వెంకటేశులు, నాయకులు నారాయణస్వామి, మాధవ నాయుడు, త్రివేంద్రనాయుడు, షౌకత్, ఎనుముల రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సామాజిక స్పృహ అభినందనీయం

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

సమాజం పట్ల ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) స్పృహ అభినందనీయమని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యుఎస్, సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 డైరీ, వాల్ క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు కె.భూతన్నతో కలిసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే కాకుండా, సామాజిక దృక్పథంతో ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతుందని అభినందించారు. ప్రధానంగా కరోనా సమయంలో వారు చూపిన చొరవ, పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ, రక్తదాన శిబిరాలు, తదితర కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ 29 శాతం ప్రకటించాలని, వీలైనంత త్వరగా 12వ పిఆర్‌సి అమలు చేయాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పదో తరగతి విద్యార్థులకు ప్రస్తుతం నిర్వహిస్తున్న వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో ఆదివారాలు, పండుగ రోజులను మినహాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు జిహెచ్.బాబు, కోశాధికారి డి.శ్రీనివాసులు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు ఈ.నారాయణస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి, నారాయణస్వామి, జీసీ నరేష్‌కుమార్, ఆర్.రామకృష్ణనాయక్, నరసింహులు, అమరనారాయణరెడ్డి, మల్లికార్జున, ఆంజనేయులు, లక్ష్మయ్య, వెంకటకిషోర్, హేమసుందర్‌రెడ్డి, రామాంజినేయులు, లక్ష్మయ్య, మాలింగప్ప, నరసింహప్ప, నరసింహమూర్తి, మూడ్ల గిరియప్ప, ఉపేంద్రమూర్తి, గంగాధర్, ఆదిజినేష్, సత్యమయ్య, జె.నరేష్, అశోక్, మల్లికార్జున, హేమసుందర్‌రెడ్డి, ఖాజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, యుటిఎఫ్ నాయకులు

రైతులకు అందుబాటులో యూరియా : జెసి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచుతామని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. జెసి శుక్రవారం మండల పరిధిలోని బుల్లసముద్రం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం యూరియా పంపిణీ, లభ్యత గురించి రైతులతో చర్చించారు. జిల్లాకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఆర్‌ఎస్‌కెలో యూరియా అందుబాటులో ఉంచుతామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. యూరియాను పంటల అవసరాలకు అనుగుణంగానే తీసుకోవాలని, ఎక్కువ తీసుకొని నిరూపయోగంగా ఉంచుకోవద్దని కోరారు. ఎరువుల దుకాణాల్లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారం, పది రోజుల వరకూ యూరియా డిమాండ్ అంతగా ఉండదని, వారంలోపు ఆర్‌ఎస్‌కెలకు యూరియా సరఫరా చేస్తే బాగుంటుందని రైతులు తెలిపారు. జెసి వెంట జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, వీఆర్వోలు, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి చంద్ర, మాజీ సర్పంచి జయపాల్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి మౌర్య భరద్వాజ్



ప్రభుత్వ పాఠశాలకు బీరువా అందజేసిన దాతలు పరంధామ, హరిప్రసాద్

ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు నిమ్మకాయల రామాంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారులు పరంధామ, హరిప్రసాద్ శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 10వేల విలువ చేసే బీరువాను అందజేశారు. దాతలు మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థుల సౌకర్యార్థం ఈ బీరువాను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహమూర్తి శుక్రవారం ప్రజాశక్తి 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పని చేస్తుంద న్నారు. ప్రజల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ అందరి ఆదరాభిమానాలు పొందు తుందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్‌లో ముద్రించిన చిత్రాలు మానవతా విలువలను ప్రతిబింబిస్తున్నాయ న్నారు. కార్యక్రమంలో మండల విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ ప్రమీలమ్మ, మండల సర్వేయర్ సుమిత్ర, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఎపిఒ చంద్రశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారులు సూర్యనారాయణ, రాజేష్, ఉపాధి హామీ సిబ్బంది మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి, ఫణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

యుటిఎఫ్ జిల్లా మహాసభలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ఈ నెల 28వ తేదీ మడకశిర పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) జిల్లా నాల్గో మహాసభ నిర్వహించనున్నారు. ఆ మహాసభకు ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజును ఆహ్వానించారు. యుటిఎఫ్ నాయకులు భూతన్న, నరసింహప్ప, మూడ్లగిరియప్ప, జోగప్ప శుక్రవారం ఎమ్మెల్యేను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.



ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రమైన లేపాక్షిలో నిర్వహిస్తున్న వ్యవసాయ ఎరవులు, మందుల దుకాణాలను శుక్రవారం తహశీల్దార్ సౌజన్య లక్ష్మి తనిఖీ చేశారు. ఆమె స్టాక్ రిజిస్టర్లు, ధరల రికార్డులను పరిశీలిం చారు. ఆమె దుకాణదారులతో మాట్లాడుతూ రైతుల నుంచి వారి పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరవులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించకూడదని, ఎంఆర్‌పి కంటే అధిక ధరకు అమ్మకూడదని హెచ్చరించారు. ప్రధానంగా నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారిని శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అమరాపురం : అమరాపురంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను శుక్రవారం తహశీల్దార్ లక్ష్మీనరసింహ, మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ తనిఖీ చేశారు. రికార్డుల ను తనిఖీ చేశారు. యురియా నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారు లకు పంపారు. రాబోయే రోజుల్లో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని దుకాణదారులను ఆదేశించారు.



లేపాక్షిలో ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న తహశీల్దార్, ఏవో

జిల్లా రగ్బీ పోటీలకు ఎంజెపి విద్యార్థులు

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వరలక్ష్మి తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్.మహేశ్వరి, వై.అనుప్రియ, కెబి.పుష్పాంజలి జిల్లా స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వరలక్ష్మి తెలిపారు. వారిని ప్రిన్సిపల్‌తో పాటు ఎస్ఎంసి ఛైర్మన్ జగదీష్, పిఇటి చందన అభినందించారు.

కష్టాలకడలిలో మొక్కజొన్న రైతు..!

ఓ వైపు వ్యాపారులు.. మరో వైపు దళారులు మోసం చేస్తున్న వైనం.. ప్రభుత్వ చేయూత కరువు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో మొక్కజొన్న రైతులు ఓ వైపు వ్యాపారులు, మరోవైపు దళారుల చేతిలో చిక్కి నష్టపోతున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సుమారు 4, 5 ఏళ్ల నుంచి రైతులు మొక్కజొన్న పంట విస్తృతంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా బోరుబావుల కింద ఎక్కువ మంది రైతులు మొక్క జొన్న పంట పండిస్తున్నారు. నిబంధనల మేరకు విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయించేందుకు వ్యాపారికి లైసెన్స్ ఉండాలి. అయితే మండలంలో చాలా మంది ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు ఎలాంటి లైసెన్స్, అనుమతులు లేకుండా షాపులు నిర్వహిస్తున్నారు. అందులో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తూ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వాటిని కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరీ ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు ఏవి కొనుగోలు చేసినా వాటికి షాపుల యజమానులు తప్పకుండా రశీదు(బిల్లు) ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా విత్తనాలు సరిగా మొలకెత్తకపోయినా, పంట ఎదుగుదల లేకపోయినా, సరైన దిగుబడి రాకపోయినా, ఎరువులు, మందులు నకిలీవి ఇచ్చినా, అవి సరిగా పని చేయకపోయినా సదరు షాపు యజమానిని ప్రశ్నించడంతో పాటు పరిహారం పొందవచ్చు. అయితే షాపుల యజమా నులు రశీదు ఇవ్వకపోవడంతో రైతులు అవగాహన లేమితో ఆయా ప్రయోజనాలు దూరమవుతున్నారు.

మరోవైపు ఇవన్నీ అధిగమించి రైతులు సుమారు 4 నెలల పాటు ఎండ, గాలి, వానకు తట్టుకొని పంట పండిస్తారు. తీరా పంట చేతికి వచ్చాక దళారులు వచ్చి పంట బేరం పెట్టి లోపాలు చూపి రైతులకు భయపెడతారు. దీంతో రైతులు పంట దిగుబడిని నిల్వ చేసుకోవడానికి స్థలం లేక ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేస్తే వర్షాలు కురిస్తే తడిచిపోతాయనే భయంతో నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడా విధి లేని పరిస్థితుల్లో పంటను అమ్మేందుకు సిద్ధమవుతారు. ఇలాంటి సమయంలో ఈ ప్రాంతంలోని దళారులందరూ సిండికేట్ అవుతారు. ఎవరి వద్దకు వెళ్లినా అందరూ రమారమి క్వింటాపై రూ. 10 లేదా రూ. 20 తేడాతో కొనుగోలు చేస్తామని చెబుతారు. దీనికి తోడు వ్యాపారులు అన్ని భారాలను రైతులపైనే వేస్తారు. వారం క్రితం మొక్కజొన్న క్వింటా రూ. 2,300 ఉండగా ఇప్పుడు రూ. 1900కు పడిపోయింది. అలాగే ఏ ఒక్క వ్యాపారి ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. క్వింటాపై అదనంగా 2 కిలోలు తీసుకోవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వ్యాపారులు 60 కిలోల సంచికి 63.300 కిలోలు తూకం వేయడంతో పాటు హమాలీ కూలీ కింద సంచికి రూ. 20, క్వింటాకు రూ. 40 భారం మోపుతున్నారు. రైతులు కేవలం నమ్మకంపై పంటను విక్రయిస్తారు. వ్యాపారి రైతు వద్ద పంట కొనుగోలు చేసిన తర్వాత వెంటనే డబ్బులు ఇస్తారా అంటే అదీ లేదు. వారి వద్ద ఉన్నప్పుడు చెల్లిస్తారు. అందులోనూ వివిధ రకాల కారణాలు చూపి మొత్తంలో కొద్దిగా డబ్బు పట్టుకొని ఇచ్చే వారు ఉన్నారు. కనీసం వ్యాపారి వాడే స్కేల్(తక్కెడ) కూడా నిబంధనలకు అనుగుణంగా ఉండడం లేదు. డిజిటల్ స్కేల్‌లో వ్యాపారలు మాయ చేసే రైతుల ను మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు ఆయా అంశాలను పరిగణలోకి తీసుకొని మొక్కజొన్న రైతులను అన్ని విధాల ఆదుకో వడంతో పాటు దళారులు, వ్యాపారులను నియంత్రించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

మొక్కజొన్న పంటను అమ్మకానికి సిద్ధం చేసిన రైతులు



అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అరెస్టు అన్యాయం

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి

ప్రజాశక్తి-పెనుకొండ

ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పిడి చట్టం బనాయించి అరెస్టు చేయడం అన్యాయం అని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హరి మాట్లాడుతూ దుర్మార్గులు, గూండాలు, రౌడీ షీటర్లు, ఆడపిల్లలను అమానుషంగా కబలించే మానవ మృగాలపై పెట్టే పిడి చట్టాన్ని ప్రజలు, రైతుల సమస్యలపై నిత్యం ఉద్యమించే నేతలపై పెట్టడం దుర్మార్గం అన్నారు. 20 ఏళ్ల నుంచి అనేక ఉద్యమాలు నిర్వహించి నాయకత్వం వహించిన అప్పలరాజుపై పెట్టిన 19 కేసుల్లో 13 కేసులను కోర్టు రద్దు చేసిందన్నారు. గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లు, భూతగదాల్లో తలదూర్చి వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వారి మీద, వైట్ కాలర్ నేరాలు చేసే వారిపై పెట్టాల్సిన పిడి యాక్ట్‌ను అప్పలరాజుపై పెట్టడం బాధాకరమన్నారు. టిడిపి, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రతి పక్షంలో ఉన్నపుడు రాష్టంలో ప్రజాస్వామ్యం, హక్కులు, లేవని విమర్శించిన వారు నేడు అధికారం రాగానే ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం గ్రామ సభలు నిర్వహించకుండా రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ప్రభుత్వం కార్పొరేట్లకు అండగా వస్తున్న పోలీసులను ప్రశ్నించిన వ్యక్తులపై నోరుమూయించడం కోసం పిడి యాక్ట్‌ను ప్రయోగించడం అప్రజాస్వామికం అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న వ్యక్తులపై ఈ యాక్టు పెట్టడం మానవ హక్కులను ఉల్లాంఘించడమే అన్నారు. అరెస్టు చేసిన అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మండల కార్యదర్శి బాబావలి, వెంకటేశులు, తిప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నరసింహ, రాజురావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

రైతులకు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచన

ప్రజాశక్తి-సోమందేపల్లి

రైతులు పంట పొలాలకు వినియోగించే రసాయన ఎరువుల మోతాదును క్రమ క్రమంగా తగ్గించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. జెసి శుక్రవారం మండల పరిధిలోని చాలకూరు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని పంటలకు రైతులు అత్యధిక మోతాదులో రసాయనిక ఎరువులు ఉపయోగిస్తున్నారన్నారు. వాటి వల్ల చీడపీడల బెడద పెరగడంతో పాటు భూసారం తగ్గి పంట దిగుబడి పడిపోతుందన్నారు. ప్రధానంగా అధిక రసాయన ఎరువుల వినియోగంతో పండించిన పంట వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. యూరియా ఎరువును ఎట్టి పరిస్థితుల్లో మోతాదుకు మించి వినియోగించరాదని రైతులకు సూచించారు. జెసి వెంట వ్యవసాయ శాఖ ఎడి కృష్ణమీనన్, డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఎఇఒ అలేఖ్య, జ్యోతి, రైతులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి మౌర్య భరద్వాజ్

కొరవడిన నిఘా..!

అటవీ ప్రాంతంలోకి అన్యుల ప్రవేశం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని యు.రంగాపురం నుంచి మడకశిర వెటర్నరీ కళాశాల వరకూ జాతీయ రహదారికి ఆనుకొని అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో ఎలుగుబంట్లు, చిరుతలు, తదితర వన్యప్రాణుల సంచారం అధికంగా ఉంది. ఈ ప్రాంతంలోకి ఇటీవల కాలంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాల్లో ఎక్కువగా వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు ఈ అటవీప్రాంతంలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు లభ్యమవడం స్థానికుల్లో ఆందోళన రేకెత్తిసోతంది. మడకశిర నియోజకవర్గం కర్నాటక సరిహద్దు కావడంతో మృతులు ఎక్కడి వారు అనేది తెలియడం లేదు. కావున అటవీ శాఖ అధికారులు, పోలీసులు స్పందించి అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లకుండా నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పశు వైద్యాధికారుల నిర్లక్ష్యం

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలో పశువులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌ను సభ్యులు నిలదీశారు. సర్పంచి వాసునాయక్ మాట్లాడుతూ రూ. 65 వేల విలువ చేసే పాడి ఆవు అనారోగ్యం బారిన పడడంతో వైద్యం కోసం పశువైద్యాధికారిని ఆశ్రయించగా ఆయన సమయానికి రాకపోవడంతో ఆవు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. పశు వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తోందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండాపురం పంచాయతీ సచివాలయానికి యూరియా సరఫరా కాక రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపిటిసి తెలిపారు. స్పందించిన ఏవో శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఇండెంట్ పంపామని, రెండు రోజుల్లో సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. నీటి పారుదల శాఖ ఏఈ మోహన్ మాట్లాడుతూ రూ. 3 కోట్ల వ్యయంతో మండలంలో జెజెఎం వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గోరంట్ల పట్టణంలో కూడా రూ. 3.15 కోట్లతో పనులు పూర్తి చేయడానికి టెండర్లు పూర్తయ్యాయన్నారు. ఈ పనుల ద్వారా పట్టణంలో తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గిరిజన గురుకుల పాఠశాలలో రూ. 15 లక్షలతో మరుగు దొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ గణేష్ మాట్లాడుతూ ఇళ్ల కోసం మండల వ్యాప్తంగా 3,600 మంది దరఖాస్తులు అందాయని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా మన్నారు. సమావేశంలో ఎంపిపి ప్రమీల, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, ఎంపిడిఒ కమలా బాయి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజ

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులు మండల పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసిన అగ్నిగుండ మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తిప్పేస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షులు షబ్బీర్, నాయకులు సన్నమారప్ప, బాలేపల్లి రాజు, చిత్ర శేఖర్ యాదవ్, ఈరన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని రాచురు గ్రామంలో శుక్రవారం పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత సమక్షంలో నారనాగేపల్లి పంచాయతీ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో 10 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి మంత్రి సవిత టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, నాయకులు మనో హర్, నాగిరెడ్డి, సోమశేఖర్, మహేష్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com



గ్రామస్తులతో కలిసి భూములు పరిశీలిస్తున్న అధికారులు

నిషేధిత భూమిలో క్రయవిక్రయాలు జరపొద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి -నంబులపూలకుంట

నిషేధిత భూమిలో క్రయవిక్రయాలు జరపరాదని తహశీల్దార్ దేవేంద్రనాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని 'ప్రభుత్వ భూమిపై కబ్జా దారుల కన్ను' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి తహశీల్దార్ స్పందించారు. శుక్రవారం రెవిన్యూ సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 573 ని కొలతలు వేసి నిగ్గు తేల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 573, విస్తీర్ణం 78 సెట్లు ప్రస్తుతం నిషేదిత జాబితాలో ఉందనిఈ భూమిని అమ్మాలన్న కొనాలన్న జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఈ కార్యక్రమం మండల సర్వేయర్ ప్రభంజన్ రెడ్డి, సర్వేయర్ ఉపేంద్ర, విఆర్ఓ నాగరాణి, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో వైద్యం

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో కాలం చెల్లిన మందులతో ఓ వ్యక్తి బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే ఓ నిరుపేద ద్విచక్ర వాహనాల మెకానిక్ రామచంద్ర పనిచేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం చలి, జ్వరంతో బాధపడుతూ మండలకేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఏ మందు ఇచ్చారో తెలియదు కానీ రోగికి కాలం చెల్లిన మందుతో రివర్స్ అయ్యి కోమాలోకి వెళ్లాడు. ఇప్పటికే దాదాపు రూ.5 లక్షల పైగా ఖర్చులు అయినట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయమై డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం ను వివరణ అడగగా డివిజన్ లెవెల్ మెడికల్ ఆఫీసర్ పంపి విచారణ చేపడతామని నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులు ఐక్యూ పెంచుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థులు తమ మేదస్సును పెంచుకోవడం కోసం ప్రతిరోజు వ్యాయామం , యోగ నిర్వహించాలని రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని జగరాజుపల్లిలో గల కేజీబీవీ లో విద్యార్థులతో మేధస్సు పెంచుకోవడం ఎలా అన్న అంశంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిన్న అన్నం నీళ్లు గాలి వల్ల వచ్చిన శక్తిని ఏ విషయాలకు సద్వినియోగం చేయాలన్న జ్ఞానం కలిగి ఉండాలని చెప్పారు. అనవసరమైన పనులకు కేటాయించే శక్తిని తనలో నిలుపుకుంటే అదే శక్తి మేధాశక్తిని పెంచి ఐక్యూ లెవెల్ ను పెంచి ఉన్నతమైన ఉత్తమమైన ఆలోచనలు పనులు చేయగలుగుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పూర్తి చేయాలి

ధర్మవరం రూరల్ : స్థానిక ఎన్నికలలోపు కుల గణన నిర్వహించాలని యాదవ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జయకృష్ణ స్వామి దేవస్థానంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసప్ప యాదవ్, డాక్టర్ వివేక్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ యాదవ సంఘం ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా లోని యాదవుల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, కుల గణన అంశాలపై విస్తృతంగా చర్చ నిర్వహించామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం చేయాలని, గ్రామస్థాయి నుంచి చట్టసభల వరకు సమతుల్య అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, నియోజకవర్గ యాదవ సాధికారిక అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ బిల్వంపల్లి కేశవ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బాల ఆంజనేయులు యాదవ్, నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అర్ధాంతరంగా ఆగిన బుక్కపట్నం మండలంలోని శ్రీ సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని యుఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం శాశ్వత భవన నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో నిర్మాణ పనులు అర్ధారంతరంగా ఆగిపోయాయన్నారు. దీంతో స్కూల్ విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రయోగశాలలు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కళాశాల భవన నిర్మాణాలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయమిత్ర పథకం అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం



నిరసన తెలుపుతున్న న్యాయవాదుదలు

జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరువప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం అంబేద్కర్ సర్కిల్ వరకు న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ లో నినాదాలు చేస్తూ న్యాయమిత్ర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు వన్నేరువప్ప, రామచంద్రారెడ్డి, ఇందాద్ మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు లా నేస్తం పథకం కింద ప్రతినెలా రూ.5 వేలు అందిస్తూ ఆదుకోవడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు ప్రతినెల న్యాయమిత్ర పథకం పేరిట అర్హులైన వారందరికీ రూ.10 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు న్యాయమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, మురళి, ఉదయ్ సింహారెడ్డి, అబ్దుల్లా, అజయ్, బాబావలి, రసూల్ బి, పవిత్ర, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి స్పెషల్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బాలకృష్ణ పిఏలు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పట్టణ వ్యాప్తంగా 38 వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన వచ్చిన అర్జీలను వారు స్వీకరించారు. పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు తాము ప్రభుత్వం నిర్దేశించిన విధంగా టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకుని ఆరు మాసాలు అవుతున్నప్పటికీ తమకు టైలరింగ్ మిషన్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. పలువురు మహిళలు తమకు సొంత ఇల్లు లేదని ఇంటి స్థలాలను కేటాయించాలని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఆటోనగర్ లో నివాసముంటున్న షేక్ షావలికి 90 శాతం వికలాంగత్వం ఉందని, రూ. 15 వేలు పెన్షన్ ఇవ్వాల్సి ఉంటే రూ. 6 వేలు ఇస్తున్నారని వికలాంగుడిని ఎత్తుకొని గ్రీవెన్స్ వద్దకు వచ్చి చూపించి సమస్యను ప్రజాప్రతినిధులు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మీడియ కోఆర్డినేటర్ చంద్రమోహన్, ఇతర టిడిపి నాయకులు, అన్ని శాఖల అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



90 శాతం వికలాంగత్వం ఉన్నా రూ.15వేలు పింఛన్ రావడం లేదని ఫిర్యాదు చేస్తున్న బాధితులు



మంచానికే పరిమితమైన పింఛన్‌కు నోచుకోని వికలాంగుడు



టైలరింగ్ మిషన్‌లు ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తున్న మహిళలు

శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీ పడవద్దని అత్యంత కఠినంగా వ్యవహరించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర పుట్టపర్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర నియోజవర్గంలో శాంతి భద్రతలపై సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి డి.ఎస్.పి విజయ్ కుమార్ నల్లమాడ సిఐ శ్రీనివాసులు ,పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఆమడ గూరు మండల ఎస్ ఐ గోపాలకృష్ణ, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ క్రాంతితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీస్ శాఖ పనిచేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోనీ గ్రామాల్లో ఎక్కడా ఫ్యాక్షనిజం రౌడీయిజం మహిళలపై,బాలికలపై అఘాయిత్యాలకు తావు లేకుండా కఠినంగా పోలీస్ శాఖ పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో జూదం ,మట్కా ,వ్యభిచారం, క్రికెట్ బ్యాటింగ్ , ఆన్ లైన్ బెట్టింగ్ , సైబర్ నేరాలు పూర్తిగా కట్టడి చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. పోలీసులంటే ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల విషయంపై పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చట్టాలపై అవగాహన అవసరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ చెప్పారు. ధర్మవరం రూరల్ రేగాటిపల్లి పంచాయతీ ముచ్చురామి గ్రామంలో శుక్రవారం ధర్మవరం రూరల్ ఎస్ ఐ రాజశేఖర్ తమ సిబ్బంది తో గ్రామ సభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి - నలచెరువు



టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

మండల పరిధి లోని ఇందుకూరి వారి పల్లిలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబుకు టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనను రెండవ సారి కన్వీనర్‌గా నియమించినందుకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కు. తమ ఎన్నికకు సహకరించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు. ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రమణారెడ్డి. మాజీ ఎంపీపీ రాజారెడ్డి. మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి. పంతల చెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఉత్తన్న. యువ నాయకులు రమణారెడ్డి. మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ ఎద్దుల అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 2026 సంవత్సరం పిక్చర్, నంబర్ క్యాలెండర్, డైరీలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆవిష్కరించారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజాశక్తి సిబ్బందితో కలిసి వాటిని విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కురుబ హనుమంతు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాలు పురుషోత్తం, టిడిపి పార్లమెంట్ కోశాధికారి మహబూబ్‌బాషా, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల వెంకటేశులు, నాయకులు ఇనాయత్‌బాషా, తిప్పేస్వామి, సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి- అమడగూరు

మండలంలోని జేకే పల్లిలో యూరియా కేంద్రాన్ని కదిరి ఆర్డీవో వి.వి.శర్మ శుక్రవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు యూరియా అవసరం ఎంతవరకు ఉందని అడిగి తెలుసుకున్నారు. మండలానికి 60మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపినట్లు వ్యవసాయ అధికారి వెంకటరమణాచారి తెలిపారు. అనంతరం ఆర్డీఓ తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.భూ రీసర్వే,గ్రీవెన్స్, భూసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామనాథ్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి,వీఆర్వో లు, రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముదిగుబ్బ మండల నూతన అధ్యక్షులు గా రామాంజనేయులు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కదిరి పట్టణంలోని ఎజిజిఒ హోంలో జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి సునీల్ కుమార్ ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున వ్యవహరించారు. ముదిగుబ్బ మండల మండల గౌరవ అధ్యక్షులుగా సి విరూపాక్ష , అధ్యక్షులుగా రామాంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులుగాబాబా ఫక్రుద్దీన్, కరుణ మెర్సీ ,ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా మమత, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వెంకట నారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా షాకీర్, కార్యదర్శులుగా ప్రమీల, రామ్మోహన్, హరి కుమార్ ఎన్నికయ్యారు. వీరికి జిల్లా కార్యదర్శి తాహెర్ వలి,రవివర్ధన్ రెడ్డి, ఖాజా, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నగర సంకీర్తన, గ్రామోత్సవం, రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామి విగ్రహానికి వివిధ అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి శాంతినగర్ నుంచి బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, ఓబుళా చారి రోడ్డు మీదుగా తిరిగి అయ్యప్పస్వామి ఆలయం వరకూ ఊరేగించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివప్రసాద్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పట్టణ ప్రజలు, ప్రముఖులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు టంకశాల హనుమంతు, గురుస్వాములు తాడూరు సిద్దేశ్వర్, బంగిశివ, కృష్ణ, రమేష్‌శెట్టి, రామ్‌ప్రసాద్, తిమ్మరాజు, ఎల్లప్ప, మహిళలు, పుర ప్రజలు పాల్గొన్నారు.



రాయదుర్గంలో నిర్వహించిన గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని సోమఘట్ట పంచాయతీ పరిధిలోని ఎస్. కొత్తపల్లి మలుపు వద్ద తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఓ కారు శుక్రవారం ఉదయం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మంచు ప్రభావమా. లేక అతివేగం వల్లనో ప్రమాదం జరిగి ఉండే అవకాశం ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - అమడగూరు

మండల పరిధిలోని కసముద్రం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. కొలిమిరాళ్ల పల్లికి చెందిన చరణ్,కంచనగారిపల్లి కి చెందిన మోక్షజ్ఞ ఇద్దరూ మోడల్ స్కూల్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.చరణ్ బంధువులు చనిపోయారని విషయం తెలియడంతో ఇద్దరూ కాలేజ్ లో అధ్యాపకులను అడిగి టివిఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనంలో వెళ్లారు. కస్సముద్రం సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందికి పడ్డారు.ఈ ప్రమాదంలో చరణ్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. మోక్షజ్ఞకి స్వల్ప గాయాలు అయ్యాయని తెలిపారు.వెంటనే స్థానికులు 108 అంబులెన్సు సమాచారం ఇచ్చి మెరుగైన చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యేకు కవితాబొజ్జన్న సన్మానం



అమిలినేని సన్మానిస్తున్న కవితా బొజ్జన్న, నాయకులు

ప్రజాశక్తి-శెట్టూరు

అనంతపురం జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కారదర్శిగా ఎన్నికైన గోళ్ల గ్రామపంచాయతీ సర్పంచి కవితాబొజ్జన్న, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గోళ్ల లక్ష్మీదేవిరమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్ శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి గజమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తనకు ఈ అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లాపురప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ, నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కెఎంసిలో రూ. 50 కోట్లతో నాలెడ్జ్ సెంటర్

-మంత్రి దృష్టికి ఆయా విభాగాల సమస్యలు

జిజిహెచ్ సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్వపు విద్యార్థుల కృషితో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. జిజిహెచ్ వివిధ విభాగాల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి టిజి. భరత్ అన్నారు.శుక్రవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని పరిశ్రమలు, వాణిజ్యం , ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ విదేశాల్లో నివసిస్తున్న కెఎంసి పూర్వ విద్యార్థులు కాలేజీ రుణం తీర్చుకునే ఉద్దేశంతో రూ.50 కోట్లతో ప్రస్తుత విద్యార్థులు , సిబ్బందికి ఉపయోగపడే నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చారన్నారు. అందుకు అందరికీ ఆమోద యోగ్యమైన 66.66 సెంట్ల స్థలంలో నాలెడ్జ్ సెంటర్ (ఇందులో అడ్వాన్స్‌డ్ లైబ్రరీ, రీసెర్చ్ సెంటర్, జిమ్ , పెవిలియన్, ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్, మీటింగ్ హాల్ మొదలగు సదుపాయాలు) సంవత్సరం లోపల ఏర్పాటు చేస్తామన్నారు. భవనం పూర్తయిన తర్వాత దీన్ని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ కు అప్పగిస్తామన్నారు. మెడికల్ కాలేజీ సిబ్బంది అందరిని అభిప్రాయం , ఆమోదం తెలపాలని కోరారు. నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి మెడికల్ కాలేజీ సిబ్బంది అందరూ ముక్త కంఠంతో ఆమోదం తెలిపారు. ఆమోదం తెలిపిన సిబ్బంది అందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కంటి ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, భవనం పాతబడిపోయి పెచ్చులు ఊడుతుందని తెలపాగా సర్వజన ఆసుపత్రి లాగ ఆ పనులను జరిగేలాగా చూస్తామని మంత్రి తెలిపారు. ఆప్టికల్ సోనోగ్రఫీ అన్న పరికరం అవసరం ఉందని తెలుపగా వెంటనే ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిధుల కొరత వల్ల ఐపిఎం బిల్డింగ్ అసంపూర్తిగా ఆగిపోయి ఉన్నదని, నిధులు కేటాయిస్తే త్వరగా పూర్తవుతుందని తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారి ద్వారా రూ. 14.16 కోట్లతో 150 బెడ్ల రోగుల సహాయకులకు రాత్రి బస నిమిత్తం నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ వారి ద్వారా భవన నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. కెఎంసి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ మెన్స్ హాస్టల్‌కు 150 మందికి సరిపోయే గదులు అవసరమని, మార్చురీ దగ్గర ఒక షెడ్ అవసరం ఉందని , ఫ్రీజర్ బాక్సులు అవసరం ఉన్నాయని తెలిపారు. ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేద రోగులకు ఇంప్లాంట్స్ ప్రభుత్వం తరపున ఉచితంగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో వేయిస్తే బాగుంటుందని కోరగా ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడుతామని మంత్రి తెలిపారు. ఆయా విభాగాల అధిపతులు అడిగిన అన్ని ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. అన్నింటిని పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. విదేశీవైద్య విద్య విద్యార్థుల సమన్వయకర్త డాక్టర్ కెజి. గోవిందరెడ్డి, ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, రఘునాథ్ రెడ్డి , జగదీష్, సాయి ప్రదీప్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం , అన్ని విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిది : సిపిఎం

ప్రజాశక్తి-పాములపాడు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లి నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన నాగేశ్వరరావు అంత్యక్రియలు నంద్యాల జిల్లా పాములపాడు మండలం లింగాలలో నిర్వహించారు. ఉదయం కర్నూలులో ఆయన తుదిశ్వాస విడిచారు. అనంతరం కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీలోని ఆయన నివాసలో ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం భౌతిక కాయాన్ని లింగాలకు తరలించారు. లింగాలలో నాగేశ్వరరావు రెండో అన్న వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనివాసులు అంతిమసంస్కారం నిర్వహించారు. లింగాలలో ఆయనను ఖననం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభ లింగాల వాసి సీనియర్ సిపిఎం నాయకులు జె.రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా , డివైఎఫ్ఐ నాయకునిగా , సిఐటియు జిల్లా నాయకునిగా, సిపిఎం పూర్తి కాలం కార్యకర్తగా అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని ఆయన నమ్మిన ఆశయం కోసం చివరిదాకా పని చేశారని కొనియాడారు. సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ నాగేశ్వరరావు చివరిదాకా ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. లింగాల సీనియర్ నాయకులు రామేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఉద్యమం బలోపేతానికి పని చేయడంతోపాటు, లింగాల అభివృద్ధికి కూడా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం, కర్నూలు, నంద్యాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.